



రుణమాఫీ కాని రైతులపై సర్కార్ దృష్టి

- మండలానికి ప్రత్యేక నోడల్ అధికారుల నియామకం
- రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేస్తున్న పలువురు రైతులు

నిజామాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పూర్తిస్థాయిలో రైతుల రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి పెట్టింది. రెండు లక్షలలోపు రుణమాఫీ కాని వారి వివరాలను సేకరిస్తోంది. మండల వారీగా వ్యవసాయ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం వారికి ఆన్‌లైన్‌లో లాగిన్ ఇవ్వగానే నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతువేదికల్లో గ్రామాల వారీగా రైతుల వివరాలను తీసుకుంటున్నారు. జిల్లాలో కొంత మంది రైతులకు బ్యాంకుల తప్పిదాల వల్ల రుణమాఫీ కాలేదు. మరికొంత మంది రైతులకు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు ఇతర సమస్యల వల్ల రుణమాఫీ జరగలేదు. వీరందరూ వందల సంఖ్యలో రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తమకు సంబంధించిన వివరాలన్నీ వ్యవసాయ అధికారులకు అందిస్తున్నారు. రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. కొన్ని మండలాల పరిధిలో బ్యాంకుల నిర్లక్ష్యానికి నిరసనగా రైతులు ధర్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు రుణమాఫీ కాకుండా ఉండటంతో నోడల్ అధికారుల ద్వారా ఈ వివరాలను సేకరిస్తున్నారు.

మూడు విడతల్లో రుణమాఫీ

జిల్లాలో మూడు విడతల్లో రైతులకు రుణమాఫీ చేశారు. మొదట లక్ష రూపాయలలోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేశారు. తర్వాత లక్షన్నర, ఆ తర్వాత రెండు లక్షలలోపు రుణాలున్న రైతులకు ఈ రుణమాఫీని చేశారు. జిల్లాలో మొదటి విడతలో 44,469 మంది రైతులకు 225.62 కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. రెండోవిడతలో లక్షన్నరలోపు రుణం ఉన్న 22,868 మంది రైతులకు 210.54 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. మూడవ విడత కింద రెండు లక్షలలోపు రుణం ఉన్న 15,724 మంది రైతులకు 190.33 కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ఈ రైతులందరికి కొత్త రుణాలను ఇవ్వాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆయా బ్యాంకుల వారీగా కొత్త రుణాలను రైతులకు మంజూరు చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో అందని సరైన వివరాలు

జిల్లాలో కొన్ని బ్యాంకుల పరిధిలో రుణాలు తీసుకున్న రైతులకు ఆ బ్యాంకులు ఆన్‌లైన్‌లో సరైన వివరాలను ప్రభుత్వానికి అందించకపోవడం వల్ల ఆ రైతులకు రుణమాఫీ కాలేదు. జిల్లాలోని కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కొన్ని సహకార బ్యాంకుల పరిధిలోని రైతులకు ఈ రుణమాఫీ కాలేదు. అర్హులు ఉన్న రైతులు ఉన్న ఆయా బ్యాంకు అధికారులు రుణమాఫీకి సంబంధించి వివరాలను అందించకపోవడం వల్ల రైతులు నష్టపోయారు. ఆ రైతులందరూ ఆయా బ్యాంకుల పరిధిలో గడిచిన కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. తమకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో రుణాలు మాఫీ చేయాలని కోరుతున్నారు. అధికారులను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో జరిగిన రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా ఆరోపణలు చేయడంతో పాటు ఏకకాలంలో రైతులకు ఎలాంటి షరతులు వర్తించకుండా రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ చేయడం వల్ల జిల్లాలో చాలా మంది రైతులకు ఈ మాఫీ వర్తించలేదు. ఆయా గ్రామాల పరిధిలో ఈ రైతులు ఎక్కువగా ఉండటంతో వారు వ్యవసాయ, రెవెన్యూ, ఇతర అధికారులను కలుస్తూ తమకు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. పలు బ్యాంకుల ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులతో పాటు వివిధ సంఘాల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు అధికారులు కసరత్తు చేశారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కాని వారిపై పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వకున్నా అందరికీ మాఫీ చేస్తామని ప్రకటించింది. ఎవరైతే మాఫీ కాకుండా ఉన్నారో వారి వివరాలను సేకరించాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్ని మండలాల పరిధిలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నోడల్ అధికారులను నియమించారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏవోలనే నోడల్ అధికారులుగా నియామకం చేశారు. ఆయా మండలాల పరిధిలోని రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అన్ని మండలాల పరిధిలో దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని రైతువేదికల వద్దకు ఎక్కువ మంది రైతులు తరలిరావడంతో విడతల వారిగా స్వీకరిస్తామని తెలిపారు. ప్రతిరోజు అందుబాటులో ఉండి వివరాలను సేకరిస్తామని ఆయా మండల వ్యవసాయ అధికారులు ప్రకటించారు. ఎక్కువ మంది రైతులు తరలివచ్చిన కూడా అన్ని వివరాలు తీసుకొని రావాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 1850కి పైగా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని అధికారులకు దరఖాస్తులు చేశారు. వీరితో పాటు ఆయా బ్యాంకుల పరిధిలో కాని వారు కూడా ఉన్నారు. ప్రతిరోజు కొంత మంది నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నోడల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాస్‌బుక్ పేర్లలో తేడా

జిల్లాలో రుణమాఫీ కాని రైతుల్లో ఎక్కువ మంది పలు రకాల కారణాల వల్ల కాలేదు. కొంత మంది రైతులవి ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్‌లలో పేర్లలో కొన్ని అక్షరాలు తేడా ఉండటం వల్ల రుణమాఫీ వర్తించలేదు. మరికొంత మందికి పట్టాదారు పాసుపుస్తకం, సర్వే నెంబర్ సక్రమంగా లేకపోవడం వల్ల రుణమాఫీ చేయలేదు. ఇంకా కొంత మంది రైతులకు రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుల గుర్తింపు సక్రమంగా లేకపోవడం వల్ల రుణమాఫీ కాలేదు. ఇలాంటి రైతులు జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్నారు. వీరంది వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. రుణమాఫీ కాని రైతులపై ప్రభుత్వం రెండు మూడు రోజుల్లో మార్గదర్శకాలను విడుదల చేయనుండటంతో దానికి అనుగుణంగా ప్రస్తుతం తీసుకుంటున్న దరఖాస్తుల ఆధారంగా అప్‌లోడ్ చేయనున్నారు. ఆ వివరాల ఆధారంగా రుణమాఫీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులు ఎక్కువ మందే ఉండటం వల్ల నోడల్ అధికారులను నియమించి ఈ వివరాలను తీసుకుంటున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 20: కొన్ని రోజుల నుంచి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున రానున్న ఐదు రోజులు మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా క్షేత్రస్థాయి సిబ్బందిని సమాయత్తం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు 2024పై వర్క్‌షాప్ ఏర్పాటు, ధరణి, ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. జిల్లాలో వర్షాల వల్ల నెలకొని ఉన్న పరిస్థితుల గురించి సంబంధిత శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ రైల్వే కమాన్ వద్ద వర్షపునీరు నిలిచిపోయి ఒకింత ఇబ్బందులు ఎదురైన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం, ఆస్తినష్టం వంటివి జరగకుండా చూడాలన్నారు. వర్షపు జలాలు రహదారుల పై నుంచి ప్రవహించే సమయాల్లో లెవల్ వంతెనలు, కాజ్‌వేల్‌లు, ఇతర సమస్యాత్మక ప్రాంతాల మీదుగా రాకపోకలను నిషేధిస్తూ ఇతర ప్రాంతాల మీదుగా వాహనాలను దారి మళ్లించాలన్నారు. వర్షాల వల్ల ఎక్కడైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడం, విద్యుత్ తీగలు తెగిపోవడం, కరెంటు స్తంభాలు కూలితే వాటి పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్‌ను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా సాధారణ స్థాయిలోనే ఉందని అయినప్పటికీ వాతావరణ శాఖ హెచ్చరికల అనుగుణంగా ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే వర్షా ప్రభావిత ప్రాంతాల నుంచి ఏదైనా సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా సిబ్బందిని సమాయత్తపర్చాలని అధికారులకు హితవు పలికారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు 2024పై ప్రజల నుంచి సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. దీనిపై జిల్లాస్థాయిలో మేధావులు, రెవెన్యూ చట్టంపై అవగాహన కలిగి ఉన్న వారితో వర్క్‌షాప్ నిర్వహించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి సిసిఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రెటరీకి పంపించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ధరణి, ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వారం పది రోజుల్లో అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసి, పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీలోకి 11వేల క్యూసెక్కుల వరద

- కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 11926 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతల్లో పరిసర ప్రాంతల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 50టీఎంసీల నీరు వచ్చి చేరిందని పేర్కొన్నారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 14150వేల క్యూసెక్కుల వరద చేరగా సాయంత్రానికి 11వేల క్యూసెక్కులకు తగ్గింది. కాగా, ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల కోసం కాకతీయ కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3700క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 522క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా మంగళవారం సాయంత్రానికి 1081.9 అడుగులు (50.288టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులో 1090.60అడుగులు, (78.694 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 47టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న జూడాలు



కొనసాగుతున్న నిరసనలు

- డ్యూటీ డాక్టర్లకు సౌకర్యాలు కల్పించాలని జూడాల డిమాండ్

పెద్దబజార్, ఆగస్టు 20: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో డ్యూటీ డాక్టర్లకు సరైన డ్యూటీ రూమ్‌లు, వాష్‌రూమ్‌లను అందించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ఓపీ సేవలు, ఎంపిక చేసిన వార్డులు, శస్త్రచికిత్సలను బహిష్కరిస్తూ ఏడో రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ.. ఆర్జిక ర్ మెడికల్ కళాశాల బాధిత మహిళలకు న్యాయం జరగాలన్నారు. సీబీఐ విచారణ, సుప్రీం కోర్టు నుంచి ఫాస్ట్‌ట్రాక్ న్యాయం జరగాలని కేంద్ర రక్షణ చట్టం యొక్క అత్యవసర అమలు చేయాలని ఆసుపత్రులల్లో అవసరమైన ప్రాంతాల్లో సీసీటీవీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల్లో, ఆసుపత్రుల్లో స్పెషల్ బలగాలను, భద్రత సిబ్బందిని పెంచాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులల్లో మహిళల ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం మహిళా భద్రత విభాగాన్ని ఏర్పాటుచేయలన్నారు. కార్యక్రమంలో జూడా జిల్లా అధ్యక్షుడు జితిన్, ప్రధాన కార్యదర్శి ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..

సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ చేపట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు వి.గోదావరి అన్నారు. మంగళవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో వైద్య విద్యార్థిని మౌమితకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలకత్తాలో ఆర్జికర్ కళాశాల విద్యార్థినిపై జరిగిన దారుణమైన సామూహిక అత్యాచారం హత్య సంఘటను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్ మౌమిత కలకత్తా నడిబొడ్డున గల ఆర్జికర్ ఆసుపత్రిలో రాత్రి 2గంటల వరకు డ్యూటీ చేసి విశ్రాంతి తీసుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడంతో కాన్ఫరెన్స్ హాల్‌లో నిద్రించడానికి వెళ్లిందన్నారు. సామూహిక అత్యాచారం చేసిన ఘటన మానవ సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు పావణి, ధనలక్ష్మి, నిర్మల, శోభ, లక్ష్మి, చంద్రకళ, సులోచన తదితరులు పాల్గొన్నారు.



- జనంతో రద్దీగా రిజిస్ట్రేషన్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ పనుల్లో తీవ్ర జాప్యం

- పనులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- మంగళవారం కేవలం 12 డాక్యుమెంట్లకు మాత్రమే నెంబర్లు
- అధికారుల కొరతతో పనుల్లో ఆలస్యం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

ఖిల్లా, ఆగస్టు 20: రిజిస్ట్రేషన్ శాఖలో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కొత్తగా బదిలీపై వచ్చిన వారు పనుల్లో జాప్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ 70నుంచి 80వరకు డాక్యుమెంట్లు జరిగే చోట కేవలం పదుల సంఖ్యలోనే నంబర్లు వేయడంతో కార్యాలయానికి వచ్చినవారు అధికారితో వాదనకు దిగుతున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు కేవలం 12 డాక్యుమెంట్లకు నంబర్లు ఇవ్వడంతో దరఖాస్తుదారులు అధికారి చాంబర్ చుట్టుముట్టారు. త్వరగా పనులు చేయాలని సబ్ రిజిస్ట్రార్ చంబర్ వద్ద గుమిగూడారు. దీంతో మంగళవారం కొంతసమయం పనులు స్తంభించిపోయాయి. ప్రభుత్వానికి అధికంగా ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖలో అధికారుల కొరత ఉండడంతో ఆ శాఖలో పనులు జరగడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. నిజామాబాద్‌లో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగేచోట ఇటీవల కొత్తగా అధికారులను బదిలీ చేశారు. వీరిలో చాల మంది సబ్ రిజిస్ట్రార్‌లు పనులు చేయలేక సెలవులు పెట్టి వెళ్లిపోయినట్లు తెలిసింది. గతంలో ఆ శాఖపై అవినీతి ఆరోపణలు ఉండడంతో ఇక్కడికి రావడానికి అధికారులు ససెమిరా ఉంటున్నట్లు సమాచారం. నిజామాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు ఉండాల్సిన చోట ఒకరు పరీక్షలు ఉన్నాయని సెలవు పెట్టినట్లు తెలిసింది. మరో సబ్ రిజిస్ట్రార్‌కు తీవ్ర జ్వరం ఉండడం వల్ల పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో సకాలంలో పనులు జరగడం లేదని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చినవారు వాపోతున్నారు.

వారంలోపు అన్నీ సరిదిద్దుతాం..


: ప్రసూన, డీఆర్ఆర్

సబ్ రిజిస్ట్రార్‌లు కొత్తగా బదిలీపై రావడంతో అవగాహన లేక పనుల్లో జాప్యం జరుగుతోంది. గతంలో సీనియర్ అసిస్టెంట్ల సహాయంతో పనులు జరిగేవి. వారు బదిలీపై వెళ్లడం వల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. వారంలోపు అన్నీ సరిదిద్దుతాం.




రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడిగా పోచారం

నిజామాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన మంత్రి హోదాలో కొనసాగుతారని పేర్కొన్నారు. బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన రెండు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదే సమయంలో కీలకమైన పదవిని కట్టబెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా ఆయనను వ్యవసాయ శాఖ సలహాదారుడిగా నియమించారు. బాన్సువాడ నుంచి పలు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. టీడీపీ హయాంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖల మంత్రిగా పనిచేశారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీ స్పీకర్‌గా ఐదేళ్ల పాటు ఆయన పనిచేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సీనియర్ ఎమ్మెల్యేగా పనిచేయడం రాష్ట్రస్థాయిలో మంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు ఈ సలహాదారు పదవిని కట్టబెట్టారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేయడంతో పాటు స్వయంగా వ్యవసాయం చేస్తున్న ఆయనకు ఈ పదవిని ఇవ్వడం పట్ల ఆయన అనుచరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పదవిని ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఆలూర్‌లో మండలస్థాయి క్రీడల నిర్వహణపై సమావేశం

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు20: ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈవో రాజగంగారాం అధ్యక్షతన హెచ్ఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండ లస్థాయి పాఠశాల క్రీడలు ఆలూర్ మండలంలోనే నిర్వహించాలని తీర్మానిం చారు. మండల పాఠశాల స్థాయి క్రీడల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటి స్తామని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు అశ్వక్‌షైమద్, రజనీ పాల్గొన్నారు.



ఇందిరా పార్క్‌లో ధర్నాను విజయవంతం చేయండి

నందిపేట, ఆగస్టు20: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథ ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్‌లో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కె గంగాధర్ కోరారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలో ధర్నా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ కోరుతూ ఎన్నికలకు ముందు రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్ళు, ఇంటి స్థలాలు ఇస్తామన్నా రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. అంతే కాకుండా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు, రూ.2లక్షల రుణమాఫీ అందరికీ చేయాలన్నారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు రైతులు, వ్యవసాయ కూలీలు తరలిరావాలని గంగాధర్ కోరారు. ఈ కార్యక్రమంలో కె.గంగాధర్, తదితరులు ఉన్నారు.

నవీపేట: ఈ నెల 22న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.నరేందర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలు ఇప్పటికి పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, రవి, హన్మాండ్లు, సాయిలు, గంగాధర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన

వేల్పూర్, ఆగస్టు20: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మంగళవారం 'ఎంపవర్ నిర్మాణ్ వారోత్సవాల్లో' భాగంగా లింగ సమానత్వం, మహిళల భద్రత అంశంపై ఉపాధ్యాయుడు పెంట జలంధర్ విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లింగ సమానత్వం, మహిళలపై చెప్పిన అంశాలను గ్రహించాలన్నారు. ప్రతీ విద్యార్థి ఏకాగ్రతతో చదువుతూ మంచి ర్యాంకులు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు అంబల్ల తిరుపతి, ముచ్కూర్ వెంకట్రాం రెడ్డి, గుర్రం విజయానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల

బాన్సువాడ, ఆగస్టు 20 : రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మంగళవారం భారతీయ జనతా పార్టీ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల కోసం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టి న విధంగా రెండు లక్షల వరకు ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయా లని, అదే విధంగా రైతు భరోసా ఎకరానికి 15 వేల చొప్పున రైతుకు, కౌలు రైతుకు ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాల న్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ కావాలంటే సుమారు 40 వేల కోట్లు కావాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ. 17 వేల కోట్లు మాత్రమే రుణ మాఫీ చేసిందన్నారు. దీని వల్ల సుమారు 60 శాతం మంది రైతులకు రుణ మాఫీ వర్తించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రైతు ప్రతిపాదికన తీసుకుని ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మక్కయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చందూరి హన్మాండ్లు, చీదురు సాయిలు, కోనాల గంగారెడ్డి, మండలాధ్యక్షులు శివ ప్రసాద్, సాయి కిరణ్,చ సాయిబాబా, శంకర్, ప్రకాష్ పటేల్, సున్నం సాయిలు, చిరంజీవి, అశ్విన్, భూమేష్, రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బహిష్కరణ

మద్నూర్, ఆగస్టు 20 : కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారనే ఆరోపణపై మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్‌ను బహిష్కరించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాయిలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలను రెచ్చగొడుతున్నార న్నారు. కాంగ్రెస్‌లో కులాలు అనేవి లేవన్నారు. కానీ ప్రస్తుతం యువజన కాంగ్రెస్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా కొన్ని కులాల వారికి ఫోన్ ద్వారా చెబుతూ లింగాయత్ కులం వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పడం వల్ల అది కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలకు తావిస్తున్నాయన్నారు. వీటన్నింటినీ గమనించి పార్టీ నుంచి సంగమేశ్వర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గంగాధర్, మాజీఎంపీపీ ప్రజ్ఞకుమార్, నాయకులు హ న్మాండ్లు, స్వామి, కుశాల్, రామ్ పటేల్, బండి గోపి, జావీద్, మండల యువజన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి హన్మంతు యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ,బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మొద్దు

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు20: రైతులు రుణమాఫీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలను నమ్మవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుల పక్షాన ఉంటుందని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులకు రుణమాఫీ జరుగుతుందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ తూతూ మంత్రంగా రైతుకు రూ.2వేలు అందిస్తుందని, అలాగే పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ పార్టీ రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేయడం నానా తంటాలు పడిందని, రైతులు వారి మాటలు నమ్మవద్దన్నారు. సాంకేతిక సమస్యల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, ఇంకా సుమారు 14వేల కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇట్టెం జీవన్, రవీందర్‌రెడ్డి, మాజిద్, భూపేందర్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ ధరించాలని అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు20: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌చౌరస్తాలో ఎస్‌హెచ్‌వో రవికుమార్ వాహనదారులకు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. తమ ప్రాణాలు ఎంత ముఖ్యమో తమ కుటుంబసభ్యుల గురించి ఆలోచించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై చిన్నయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.













ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ !? : బీఆర్ఎస్



వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు



బ్యాంకు ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు

వేల్పూర్, ఆగస్టు20: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ అమలులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని, ఈ విషయం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డి తెలుసుకోక పోవడం సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్లబొల్లి మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఎలాంటి ఆంక్షాలు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేశామని సునీల్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా రుణమాఫీ పూర్తి కాలేదన్నారు. గత రెండు రోజుల క్రితం వేల్పూర్‌క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమానికి భారీ సంఖ్యలో రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చిన సునీల్‌రెడ్డి కనిపించలేదా అని ప్రశ్నించారు. రైతులు రుణమాఫీ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతూ ప్రభుత్వానికి వ్య తిరేకంగా నినాదాలు చేసినవి మరిచిపోయారని ప్రశ్నించారు.వేల్పూర్ మం డలంలో 11వేల216మంది రైతులు ఉంటే, 2600పై చిలుకు రైతులకు మాత్రమే రైతులకు రుణమాఫీ జరిగిందని, ఇక్కడ 8500పైగా రుణమాఫీ రాలేదన్నారు. ఇదీ మీకు కనిపించడంలేదా, వ్యవసాయ అధికారుల నుంచి లెక్కలు తీసుకోవడంలేదా అని అన్నారు. రైతులందరికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తూ ప్రతిపక్షాలు మాట్లాడయన్నారు. రుణమాఫీ అందరికి పూర్తిస్థాయిలో అయ్యేంత వరకు ప్రతి పక్షంలో ఉన్న మాకు అడిగే హక్కు, నిలదీసే హక్కు మాట్లాడడం తమకుందని ఉంటుందని, ఎలాంటి కోతలు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ పూర్తి స్థాయిలో ఇచ్చేంత వరకు బీఆర్ఎస్ పార్టీ నిద్రపోదని మిమ్మల్ని నిద్రపోనివ్వామని సునీల్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీరడిభాగ్య, మిట్టపల్లి మహిపాల్, డొల్ల రాజేశ్వర్, రేగుల్ల రాములు, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

● నేడు కమ్మర్‌పల్లిలో ధర్నాకు బీఆర్ఎస్ పిలుపు

కమ్మర్‌పల్లి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలు అమలు చేయాలని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీపథకాలు అంటూ.. అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ పథకాల అమలులేదని రాష్ట్ర నాయకుడు బద్దం చిన్నారెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతుసమన్వయసమితి అధ్యక్షుడు బద్దం రాజేశ్వర్ మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు బద్రి, సంత రాజేశ్వర్, వేముల శ్రీనివాస్, సుభాష్‌గౌడ్, పాష, గ్రామశాఖ అధ్యక్షుడు నరేందర్ కేకే, పన్నాల గంగారెడ్డి, కొత్తపల్లి రఘు, పాల్గొన్నారు.

● రైతులతో కలిసి ధర్నా చేస్తాం

ముప్కాల్: ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రైతులను మోసం చేశాడని, రాబోయే రోజుల్లో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ముప్కాల్, బాల్కొండ మండలా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, బద్దం ప్రవీణ్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులను అవమాన పరుస్తూ అందరికి రుణమాఫీ చేయకపోవడం సిగ్గుచేటని, కొందరికి చేసి మరికొందరి రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ అమలు చేశామని చెప్పి మోసం చేయడాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, జోషి ఉమాశంకర్, టి.సాయన్న, గంగాధర్, నవీన్, రాజేశ్వర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● ఏర్గట్లలో రుణమాఫీపై కర్షకుల నిరసన

ఏర్గట్ల: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద మంగళవారం రైతు రుణమాఫీపై రాజకీయాలకు అతీతంగా నిరసన చేపట్టారు. మండలంలో 4266 మందికి కేవలం 987 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని, ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని మండల నోడల్ అధికారిణి మనీషాకు వినతి పత్రం అందజేశారు. ఇట్టి విషయమై నోడల్ అధికారిణి మనీషాను వివరణ కోరగా తప్పులు ఉన్న వారితో పాటు రేషన్ కార్డు లేని వారి 66 మందికి సంబంధించి వివరాలు సేకరించామని తెలిపారు.

● రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌రూరల్: రైతులందరికి వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లెపు వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిందని, మూడు విడతలుగా రుణమాఫీ చేసినప్పటికీ సుమారు 40శాతం మంది రైతులు రుణమాఫీ కాకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, రవి, భాస్కర్, వినోద్, అవోక్, ఎర్రన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.

● రుణాల మాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అన్ని గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. మంగళవారం వివిధ గ్రామాల్లో రుణమాఫీ కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొందరికి రుణమాఫీ జరిగిందని, అర్హులైన రైతులకు రుణమాఫీ జరగలేదని, బ్యాంకుల్లో రైతుల వివరాలు తప్పులు, ఒప్పులు ఉండడం వల్ల కొందరు రైతుల రుణాలు ఆఫీ కాలేదని అన్నారు. రుణాల మాఫీ కోసం బ్యాంకుల చుట్టు తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆర్మూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి సుమారు తొమ్మిది నెలలు కావస్తున్న వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తూ ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అందరికి మాఫీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కొద్దిమంది రైతులకు రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నా రన్నారు.ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, కౌన్సిలర్‌లు లింబాద్రి, పర్స నవీన్, బోదిరె నర్సయ్య, మాజీసర్పంచ్‌లు రాములు, నర్సిం హచారి, నాయకులు కర్నె సత్యగంగయ్య, లింబాద్రిలు పాల్గొన్నారు.

● రుణమాఫీ రాలేదని ఆగ్రహించిన రైతులు

మోస్రా: మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఎదుట మండలంలోని ఆయా గ్రామాల రైతులు ధర్నా చేశారు. ఈ తప్పు ఎవరి నిర్లక్ష్యం వల్ల జరుగుతుంది ప్రభుత్వ పాలకులదా? ప్రభుత్వ అధికారులదా? బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యమా? బ్యాంక్ సిబ్బంది రైతులను ఇబ్బంది పెడుతున్నారు. మాఫీ రాలేదు అని అడిగితే సాంకేతిక లోపం అని, ఆధార్ కార్డ్ వెరిఫికేషన్ అంటూ మమ్ములను ఈ బ్యాంక్ చుట్టూ తిప్పుకుంటున్నారు అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్ర, ఆయా గ్రామాల రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమావేశం



బాల్కొండలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీవో

ముప్కాల్, ఆగస్టు20:బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ఎంపీవో గంగామోహన్ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. అనంతరం ఎల్ఆర్-2020పై నూతన విధానాలను కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కారోబార్‌లు, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదిక వద్దకు తరలిన రైతులు

సిరికొండ, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేసిన పంట రుణాల మాఫీ పథకంలో రుణ మాఫీ కాని రైతులు మంగళవారం సిరికొండ రైతు వేదికను భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి విషయం తెలిసిందే. మూడు విడుతలుగా ప్రభుత్వం రుణాలు మాఫీ చేసిన తర్వాత చాలా మంది రైతులకు రుణాల మాఫీ జాబితాలో పేర్లు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. కొన్ని చోట్ల రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయడంతో ప్రభుత్వం మండలానికో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో మంగళవారం సిరికొండ రైతు వేదికకు రైతులు చేరుకుని దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కరోజే సుమారు 197 మంది రైతులు రుణాలు మాఫీకాలేదని దరఖాస్తులు చేసుకున్నట్లు ప్రత్యేక అధికారి కృష్ణారెడ్డి వెల్లడించారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయాలి

● బోధన్ జేఏసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి

బోధన్ రూరల్, ఆగస్టు 20: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయాలని బోధన్ జేఏసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రైస్‌మిల్ అసోసియేషన్ భవ నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు తదితర ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ మాట ఇచ్చిన ప్రకారం రుణమాఫీ చేస్తే ప్రభుత్వాన్ని ప్రజలు పువ్వుల్లో పెట్టుకుని చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శివరాజ్, కల్దుర్కి నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

బోధన్‌లో ప్రొఫెసర్ ముత్యంకు ఘన నివాళి

బోధన్ రూరల్,ఆగస్టు 20:ప్రజారచయిత, సాహితీ పరిశోధకుడు ప్రొఫెసర్ కె. ముత్యంకు మంగళవారం బోధన్ పీఆర్‌టీయూ భవన్‌లో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు.ఈసందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు నడిపి భూమయ్య మాట్లాడుతూ.. ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌కుమార్, నాయకులు చిన్న పర్వయ్య, పోశెట్టి, సుధాకర్, పీడీఎస్‌యూ నాయకులు సాయినాథ్, రాఘవేంద్ర, ప్రకాష్, జమున, స్వాతి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

● నందిపేటలో ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం సంతాప సభ

నందిపేట: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లాకు చెందిన కామ్రేడ్ ముత్యం ఎన్నో పుస్తకాలను రచించారని, సాహిత్యాలను, కవితను రచించారని పేర్కొన్నారు. అంతే కాకుండా సిందుల ఎల్లమ్మ జీవిత చరిత్రను రచించి అర్సపల్లిలో సంతాప సభ నిర్వహించిన మహా వ్యక్తి ముత్యమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె గంగాధర్, దేవన్న, ఎస్వి సతీష్, విశ్వనాథ్, రాజేశ్వర్, మహిమూద్, రాకేష్, దిగంబర్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవీపేట,ఆగస్టు20: 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నారాయణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితలో చనిపోయిన వారి పేర్లను తొలగించాని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ నరేష్, డివిజన్ శిక్షకులు నరేందర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవ.. ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు20: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌చౌరస్తా వద్ద మద్యం మత్తులో ఇద్దరు గొడవ పడగా ఒకరికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెర్కిట్‌కు చెందిన హామాలీలు బండి మహేష్, ఆకుల ప్రశాంత్‌లు కూలీ పని ముగించుకొని ఇద్దరు మద్యం సేవించి గొడవ పడ్డారు. మద్యం మత్తులో ఆకుల ప్రశాంత్ బండి మహేష్‌పై పదునైనా ఆయుధంతో దాడి చేయగా చాతిపై గాయాలయ్యాయి. మహేష్ సోదరి అపే ప్రయత్నంలో ఆమె చేతికి గాయామైంది. దీంతో ప్రశాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. మహేష్‌ను 108అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో రవికుమార్ సంఘటన పరిశీలించారు. మహేష్ సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందర వందరగా ఉన్న దృశ్యం

నవీపేట,ఆగస్టు20: మండల కేంద్రంలోని నందిపేట రోడ్డు పక్కన ఉన్న బాలకోటిరెడ్డికి చెందిన తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా చీమకుర్తిలో జరిగిన శుభకార్యానికి కుటుంబ సభ్యులంతా కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు ఇంటి ప్రధాన తలుపునకు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. లోపల ఉన్న బీరువాను ధ్వంసం చేసి వస్తువులను చిందర వందర చేశారు. బీరువాలో ఉన్న 40వేల రూపాయల నగదు, తులం బంగారం, 25తులాల వెండి వస్తువతులను దొంగలు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. దొంగతనం విషయమై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామని బాలకోటిరెడ్డి తెలిపారు.

గోడ కూలి వృద్ధురాలి మృతి

కోటగిరి,ఆగస్టు20: కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్ నగర్ కాలనీలో మంగళవారం బోర్లం సాయవ్వ(82)అనే వృద్ధురాలిలపై గోడ కూలి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత మట్టిగోడ తడిసిపోయి ఆమెపై పడింది. కోన ఊపిరితో ఉన్న సాయవ్వను చికిత్స నిమిత్తం 108లో బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. గైని ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ బాలికల వసతి గృహం తనిఖీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు20: పట్టణంలోని శాస్త్రీనగర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మంగళవారం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజగంగారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని రిజిష్టర్‌లను పరిశీలించి, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్ సుమలతకు సూచించారు.

అత్యాచార నిందితుల దిష్టిబొమ్మ దహనం



కమ్మర్‌పల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి,ఆగస్టు20:పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క డిమాండ్ చేశారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో పీవోడబ్ల్యూ,సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథ)ఆధ్వర్యంలో జాతీయరహదారిపై అత్యాచార నిందితుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థిపై జరిగిన దారుణ అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు.ట్రైనీడాక్టర్‌పై పాశవికంగా అత్యాచారానికి పాల్పడి హత్యచేయడం సిగ్గుచేటన్నారు. దోషులను గుర్తించి అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాల్సిన పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఒకరిపైఒకరు నెట్టుసుకోవడంతోనే సరిపెట్టుకుంటున్నారని విమర్శించారు.ఈసంఘటనను బీజేపీ ప్రభుత్వం రాజకీయంగా వాడులకోవాలని యోచిస్తున్నదని ఆరోపించారు. బెంగాల్ ప్రభుత్వం మొద్దు నిద్రమాని నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) కమ్మర్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడు అశోక్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షులు సారా సురేష్, ఏఐపీకేఎమ్ఎస్ జిల్లా కార్యదర్శి కిషన్,ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, జిల్లా నాయకులు రాజేశ్వర్,తెలంగాణ ప్రగతిశీల మహిళ సంఘం మండల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో పిచ్చి కుక్క స్వైర విహారం

● 12 మందికి గాయాలు



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

బోధన్ రూరల్, ఆగస్టు 20:బోధన్ పట్టణంలోని తట్టికోట, కుమార్‌గల్లి తదితర ప్రాంతాలలో మంగళవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 12 మందిని గాయపరిచింది. నాలుగు సంవత్సరాల బాలుడితో పాటు రోడ్డుపై వెళుతున్న గర్భిణీ స్త్రీతోపాటు పలువురిపై దాడి చేసింది. ఈఘటనలో 12 మందికి కుక్కకాట్లు వేసింది. అనంతరం చికిత్స నిమిత్తం గాయపడిన వారితో పాటు కుటుంబ సభ్యులు పిచ్చి కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేస్తూ బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ధర్నా నిర్వహించారు.ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించారు.కుక్కల బెడదను మున్సిపాలిటీ, సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలరు.ఈ కార్యక్రమంలో బీజేపీ ము న్సిపల్ ఫ్లోర్‌లీడర్ వినోద్, ఆమ్‌ఆద్మీ పార్టీనాయకులు జునేద్ అహ్మద్‌లతో పాటు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయండి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు20: ఏకకాలంలో రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా సాధన కోసం నిర్వహించ తలపెట్టిన చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీన మా మిడిపల్లిలోని సాయిగార్డెన్స్‌లో ఉద యం 10గంటలకు రైతు ల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ రైతు కుటుం బం నుంచి ఇద్దరు చొప్పున హాజరుకావాలని వారు కోరారు. రైతుల సమస్యల సాధ నకు ప్రతీఒక్కరు కలిసి నడవాలని ఆర్మూర్ ప్రాంత రైతులకు విజ్ఞప్తి చేశారు.

జిల్లా అంతటా ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి దృశ్యం

మాక్లూర్,ఆగస్టు20:మండల కేంద్రంలోని మా క్లూర్‌లో మంగళవారం స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరంవారు మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మూడు దఫాలుగా అంద జే శామని, రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు మంజూ రు కాగా రూ.18వేలకోట్ల వరకు మాఫీ చేశామని, మరో రూ.13వేల కోట్లు నిల్వ ఉన్నాయని అర్హులం దరికి నెలలోపు మాఫీ చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రవి ప్రకాష్, మండల కన్వీనర్ జయసింగ్, ఉపాధ్యక్షుడు చిన్నరా జేశ్వర్, దేవనంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● కమ్మర్‌పల్లిలో రాజీవ్‌గాంధీ జయంతి

కమ్మర్‌పల్లి: దివంగత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాలను కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కమ్మర్‌పల్లిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశప్రజలకందించిన సంక్షేమ పథకాలు సేవలను కుటుంబ ప్రాణత్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూకల బుచ్చిమల్లయ్య, పాలెపు నర్సయ్య, వేములు గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, నల్ల సాయి కుమార్, పూజారి శేఖర్, ప్రసాద్, అజ్మత్ హుసేన్, అజాహరోద్దీన్, జగదీశ్, దూలూరు కిషన్ గౌడ్, ప్రదీప్, సుంకెట శ్రీనివాస్, చంద్రకాంత్, గంగాధర్, తదితరకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ నాయకులు బాలింతలకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మీర్‌మాజిద్, రింగుల భూషణ్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకడానికి యత్నించిన మహిళ

● కాపాడిన యువకులు ● పోలీసులకు అప్పగింత



తల్లీ, ఇద్దరు పిల్లలను బాసర పోలీసులకు అప్పగించిన యువకులు

నవీపేట,ఆగస్టు20: నిజామాబాద్ నగరానికి చెందిన స్వాతి అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకుని యంచ గోదావరిలో దూకడానికి ప్రయత్నించగా స్థానిక యువకులు ఆమెను కాపాడి బాసర పోలీసులకు అప్పగించారు. కుటుంబ కలహాలతో ఆమె కుమారుడు, కుమార్తెను వెంట బెట్టుకుని గోదావరి వద్దకు రాగా అక్కడే ఉన్న యంచకు చెందిన భూంరాజ్, రాజు, ప్రశాంత్‌లు వారిని కాపాడి బాసర ఏఎస్ఐ మృదులకు అప్పగించారు. అనంతరం బాసర పోలీసులు సంబంధిత మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.తల్లి,పిల్లలనుకాపాడిన యువకులను స్థానికులు అభినందించారు.

గుత్పలో యువకుడి ఆత్మహత్య

మాక్లూర్, ఆగస్టు20: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుత్ప గ్రామానికి చెందిన నాగుర్ల శ్రీకాంత్(34) అనే వ్యక్తి గుంతలోపడి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎఎస్సైగంగాధర్ తెలిపారు. మృతుడు శ్రీకాంత్ గత కొన్ని సంవత్సరాల క్రిం మాక్లూర్‌కు చెందిన శ్రీలతతో వివాహం జరిగింది. భార్య, భర్తల మధ్య మనస్పర్ధాలు రావడంతో భార్య తన పుట్టిళ్లు అయిన మాక్లూర్‌కు వెళ్ళింది. ఆరు నెలలైన తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది శ్రీకాంత్ ఈనెల 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని మృతుని తండ్రి భూమన్న తెలిపారు.గుత్ప గ్రామశివారులో గుంతలో మృతదేహం కనిపించగా శ్రీకాంత్ దేనని గుర్తిం చారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జీ ఎస్సై గంగాధర్ తెలిపారు.

నేటి భారత్ బంద్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు, బీఎస్పీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు20: ఇటీవల సుప్రీం కోర్టు ఎస్సీవర్గీకరణపై ఇచ్చిన తీర్పును పునసమీక్షించాలని నేటి భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు, బీఎస్పీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తున్నామని, నేడు భారత్ బంద్‌కు వ్యాపార, వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్ పాటించి విజయవంతం చేయాలని వారు కోరారు.

● భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

బోధన్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్ అన్నారు. మంగళవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ బుధవారం బహుజన సమాజ్ పార్టీ, జాతీయ బహుజన సంఘాల పిలుపు మేరకు భారత్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కావున బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో బోధన్ బంద్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బంద్‌కు దుకాణదారులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్ర.దాన కార్యదర్శి నీరడి రవి, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుడు కారం స్వామి, యాదగిరి, దాసరి శ్యామ్, ఇందూరు సాయిలు, విద్యాసాగర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై
కఠిన చర్యలు తప్పవు : ఎస్సై

సిరికొండ ఆగస్టు 20 : ప్రభుత్వ ,అటవీ భూములను ఎవరు ఆక్రమించిన కఠిన చర్యలు తప్పవని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ హెచ్చరించారు. జంగిలోడి తండాలో ఆక్రమిత అటవీ భూములను స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అటవీ, పోలీస్ సిబ్బందిపై తిరుగబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ప్రస్తుతం నలుగురిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. అరెస్టు అయిన వారిలో రాములు, రంగయ్యరమేష్, అర్జున్ ఉన్నారు. తండాకు చెందిన 23 మంది మగవారు. పదకొండు మంది మహిళలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవానికి వెళ్లిన అటవీ, పోలీస్ సిబ్బంది విధులను ఆటంక పరిచినందుకు, చట్టవిరుద్ధంగా అటవీ భూములను ఆక్రమించుకున్నారని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.ఈ సందర్భంగా ఎస్సై రామ్ మాట్లాడుతూ అటవీ భూములను కాని ఇతర ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే చాలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పోలీసులు కాని, అటవీ సిబ్బంది విధులను ఆటంక పరిచిన, అడ్డుకుని ఎదురు తిరిగిన కేసులు, అరెస్టులు తప్పవన్నారు.సిరికొండ మండలంలో ఎక్కడ అటవీ భూములను ఆక్రమించుకుని సాగుచేయడానికి ప్రయత్నిస్తే జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. ఇలాగే కేసుల్లో ఇరుక్కుంటే పీడీ చట్టం కిందా కూడ కేసులు పెట్టక తప్పదన్నారు. తమ హెచ్చరికనలు ఖాతరు చేయకుండా అదే పనిగా భూముల ఆక్రమనకు పాల్పడితే మాత్రం చట్టం నుంచి తప్పించుకోరని ఎస్సై హెచ్చరించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 20: భారతరత్న, దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు కేశవేణు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి, నగరంలోని వినాయక్‌నగర్‌లోగల విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు కేశవేణు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడమే కాకుండా సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. మన దేశం ఇప్పుడు ఐటి రంగంలో ఈ స్థాయిలో ఉందంటే రాజీవ్‌గాంధీ ఆలోచనా విధానాలే కారణమన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డిసిసిబి చైర్మన్ రమేష్‌రెడ్డి, నాయకులు సంతోష్, వేణురాజ్, లింగం, వినయ్, ఉషా, ప్రభాకర్, ప్రమోద్, భాస్కర్, సుభాష్‌జాదవ్, నర్సింగ్, సాయికుమార్ పాల్గొన్నారు.

నూతన ఓటరు నమోదుపై శిక్షణ కార్యక్రమం



ఉద్యోగులకు శిక్షణ కల్పిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, ఆగస్టు 20: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్‌భవన్‌లో మంగళవారం మాస్టర్ ట్రైనర్స్‌తో సిబ్బందికి శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అంతేకాకుండా ఇంటి వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. మరణించిన వారిని సైతం ఓటరు జాబితా నుంచి తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో సిబ్బందికి నూతన ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

గ్రామాల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

ధర్పల్లి: గ్రామాల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎండీవో బాలకృష్ణ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి 22 ఓటరు జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిసారించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు కార్యదర్శులు స్థానికంగా ఉండి పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్న సందర్భంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటినిల్వలు ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల నివారణ మందును పిచికారి చేయాలని ఎండీవో సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 20: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సీజీఆర్‌ఎఫ్ మెంబర్ రామకృష్ణ అన్నారు. విద్యుత్ వినియోగదారుల కోసం ప్రతీ నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని అర్సపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికకు కేవలం ఒకే ఫిర్యాదు అందింది. సతీష్‌కుమార్ అనే వినియోగదారుడు ఎల్‌టి లైన్ షిఫ్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొనగా ఎస్టిమేట్ మంజూరు ప్రకారం షిఫ్టింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈలు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం, విద్యుత్ ఉద్యోగులు రవికిశోర్, రావు, నాగేష్, రమణ, పండరినాథ్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్

ఖిల్లా, ఆగస్టు 20: ట్రాఫిక్ నిబంధనలపై పోలీసు కళాబృందం సిబ్బందితో కలిసి నగరంలోని ఆర్‌బివిఆర్‌ఆర్ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ. టి.నారయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.ముఖ్యంగా మైనర్లు వాహనం నడుపరాదన్నారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదా బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్‌లో సీట్ సాధించడం అభినందనీయం

ఖిల్లా, ఆగస్టు 20: నీట్‌లో సీట్ సాధించిన సిబ్బంది పిల్లలను పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో మంగళవారం నీట్‌తో పాటు ఐదు ప్రభుత్వ ఉద్యోగులు సాధించిన పిల్లలకు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. టౌన్-5లో పనిచేస్తున్న మోహన్ కూతురు లాస్య నీట్‌లో 720మార్కులకు గాను 603, టౌన్-3లో పని చేస్తున్న రఘువర్ధన్ కుమారుడు స్నేహాశ్ 720మార్కులకుగాను 578మార్కులు, సీసీఎస్‌లో పని చేస్తున్న కేర్‌బాజీ కుమార్తే మౌన 720మార్కులకు గాను 539 మార్కులు సాధించారు. ఎస్‌ఐబీలో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కుమార్తే ఆర్.కావేరి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు.

ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన సదస్సు

పెద్దబజార్, ఆగస్టు 19: ప్రపంచ దోమల దినోత్సవం, సీజనల్ వ్యాధులపై ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నగరంలోని అర్సపల్లిలోగల పట్టణ ఆరోగ్య కేంద్రంలో హరిచరణ్ మార్వడి జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 20, 1897 సంవత్సరంలో రొనాల్డ్ రోస్ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా దోమల ద్వారా మలేరియా వ్యాధి మనుషులకు వ్యాపిస్తుందని తెలియజేశారు. దోమల నియంత్రణ ద్వారా దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ చికున్ గున్యా, మెదడువాపు మొదలగు వ్యాధుల నియంత్రణతో పాటు ప్రజలందరూ దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, తదితర వ్యాధుల వల్ల ఇంటి పరిసరాలలో నీటినిల్వలు తొలగించాలన్నారు. అదేవిధంగా ఇండ్లలో వాడేటువంటి కూలర్లు, నీటి తొట్టెలు, సంప్‌లు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుభ్రంగా కడిగి ఎండబెట్టి మరుసటి రోజు వాడుకోవాలన్నారు. ముఖ్యంగా కలుషితమైన ఆహారం, నీరు ఈగలు, దోమల ద్వారా కలుషితమైన చేతివేళ్ల ద్వారా వ్యాపిస్తాయని అన్నారు. ముఖ్యంగా డయేరియా, అతిసారా, టైపాయిడ్, నీళ్ల విరోచనాలు ఇలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, అధ్యాపకులు సంజీవ్, నరేష్, పూర్ణచందర్‌రావు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది సునీత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 20: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉందని అందకు పంచాయతీ కార్యదర్శులు నివారణ చర్యలు తీసుకోవాలని ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని నడిపల్లి పంచాయతీలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని, అం దుకు గ్రామంలో ని అన్ని వర్గాల ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో నడిపల్లి ఈవో కిసన్ రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

డిచ్‌పల్లి, ఆగస్టు 20: ఇందల్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో గన్నారం 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి నడుచుకుంటు వెళ్తున్న చిన్నగారి కొండయ్య అనే వ్యక్తి ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందడాని ఇందల్వాయి ఎస్సై తెలిపారు. మృతుడు మేస్త్రీగా గన్నారంలో పనులు చేసుకుంటాడని, మృతుని స్వస్థలం ప్రకాశం జిల్లా అని ఎస్సై తెలిపారు.

ముత్యం మృతి ప్రజా ఉద్యమానికి తీరనిలోటు

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి

పెద్దబజార్, ఆగస్టు 20: ప్రముఖ రచయిత పరిశోధన సాహిత్య రంగంలో కృషి చేసిన ప్రొఫెసర్ ముత్యం మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మంగళవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్ భవన్‌లో ముత్యం సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యం వృత్తిరిత్యా ప్రొఫెసర్‌గా మారిన అనేక అంశాలపై పుస్తకాలు రాశారని అన్నారు. శ్రీకాకుళం ఉద్యమంపై పరిశోధన చేసి పుస్తకాన్ని రాశారని చెప్పారు. తన జీవితకాలంలో 30కి పైగా పుస్తకాలు రాశారని తెలిపారు. ముత్యం రచించిన చిందు ఎల్లమ్మ జీవితకథ వారి జీవనంపై రాసిన వ్యాసాలు, కథనాలు అత్యధిక ప్రజాధారణ పొందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నీలం సాయిబాబా, ప్రజాసంఘాల నాయకులు భూమయ్య, శివకుమార్, సత్యం, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిపో-3పై చర్యలు తీసుకోవాలి

ఖిల్లా, ఆగస్టు 20: డిపో-3 యజమానులు నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి టీసీఎస్-3లో సభ్యత్వం తీసుకున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే తమపై దాడులకు ఉసిగొలుపుతున్నారని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌కు నగరానికి శ్రీనివాస్, రాజగోపాల్‌గౌడ్, స్వామిగౌడ్‌లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల క్రితం తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సభ్యత్వం కల్పించి నగరంలోని స్థానికంగా ఉండే నిజమైన గీతకార్మికులకు అన్యాయం జరుగుతుందని కలెక్టర్‌కు, డీసీఈఎస్‌లకు ఫిర్యాదు చేశామని సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో గాయత్రినగర్‌లో ఉన్న రాజగోపాల్‌గౌడ్‌కు చెందిన కల్లుబట్టీపై దాడి చేసి లాక్కున్నారని తెలిపారు. డిపో-3కు చెందిన స్వామిగౌడ్, జయసింహాగౌడ్, సుమన్‌గౌడ్ తమ అనుచరులతో మాపై దాడులకు ఉసిగొల్పుతున్నారన్నారు. ఇండ్లను ముట్టడి చేయాలని బయట ఎక్కడ కనిపించిన దాడి చేయాలని వాట్సప్ గ్రూప్‌లో మెసెజ్‌లు పెడుతున్నారన్నారు. వీరి నుంచి ప్రాణహాని ఉన్నదని రక్షణ కల్పించాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

పెద్దబజార్, ఆగస్టు 19: నగరంలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్‌తో డివిజన్‌లను దేవిటాకీస్ రోడ్‌లో ఉన్న సార్వజనిక్ శ్మశాన వాటిక, కంఠేశ్వర్ సార్వజనిక్ శ్మశాన వాటిక, గాజుల్‌పేట్ సార్వజనిక్ శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రహరిగోడ, స్నానపు గదులు, బోరు మోటారు, స్టోర్ రూమ్ వంటి నిర్మాణ కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోమవారం కురిసిన భారీ వర్షం చూసి రైల్వే కమాన్ వద్ద వాహనాలు చిక్కుకున్న సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి ఇలాంటివి మునుముందు జరగకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ మురళి, ఏఈ పవన్, బీజేపీ మున్సిపాలిటీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, ప్రభాకర్, శ్రీనివాస్, గంగాధర్, ఆకుల శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మీసాల వర్సెస్ నాగొళ్ల..

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పర్యటనలో బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన కార్పొరేటర్ మీసాల సవిత భర్త మీసాల శ్రీనివాస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు నాగొళ్ల లక్ష్మీనారాయణ మధ్య గొడవ రాజుకుంది. కార్యక్రమంలో పాల్గొనేందుకు భార్య సవితతో కలిసి వచ్చిన శ్రీనివాస్ కారు నిలిపి అక్కడే ఉన్న ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన లక్ష్మీనారాయణ మీసాల శ్రీనివాస్ కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కారు పక్కకు తీసి మాట్లాడుకోవాలని విరుచుకు పడ్డారు. దీంతో అక్కడ ఉన్న వారంతా విస్తుపోయారు.

ప్రజలను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పెద్దబజార్, ఆగస్టు 19: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి సామాన్య ప్రజలను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగారం బొందంగడ్డ చెరువు కబ్జా వెనక బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యస్థాపన అంటూ తెలంగాణను నిండా ముంచిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్‌లు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం రైతుల ఆత్మహత్యలు మూడవ స్థానంలో ఉంటే ప్రస్తుతం మొదటి స్థానానికి చేరిందన్నారు. రుణమాఫీ ఒక మాయాజాలమని ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి దశల వారిగా చేస్తున్నారని అన్నారు. అది కూడా పూర్తిస్థాయిలో చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలంరాజు, నాయకులు పల్నాటి కార్తిక్, లక్ష్మీనారాయణ, స్వామియాదవ్, బద్దం కిషన్, సాయివర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అధికారులను ప్రశ్నించిన రైతులు



రైతువేదిక వద్ద బైఠాయించిన రైతులు

మోపాల్, ఆగస్టు 19: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని గ్రామాల్లో సమాచారం తెలియడంతో పెద్ద ఎత్తున వివిధ గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. అక్కడున్న వ్యవసాయ శాఖ అధికారి, ఏవో, ఏఈవోలను రైతులు తమ రుణమాఫీ ఎందుకు కాలేదని అధికారులను ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్సులు ఇచ్చినట్లయితే రుణమాఫీ వచ్చేలా చూస్తామని రైతులకు అధికారులు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించారు. ఈ సందర్భంగా ఏవో సౌమ్య మాట్లాడుతూ రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు వివరించారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 20: నగరంలోని నాగారం ప్రాంతంలో దొంగ పట్టాలు చేసి పేదలను మోసం చేసిన సూత్రధారులు, పాత్రధారులను శిక్షించాలని బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోను కలిసి మంగళవారం బాధితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ నగరంలో అధికార పార్టీ అండతో మేయర్ భర్త దండు నీతూకిరణ్ శేఖర్ కొద్దిమంది అనుచరులను అడ్డం పెట్టుకొని పేదల అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూముల్లో, చెరువు శిఖం భూముల్లో దొంగ పట్టాలు చేసి లక్షలాది రూపాయలు దండుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షురాలిగా దీపిక

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 20: భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలిగా దీపిక ఎన్నికైంది. మంగళవారం జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో నూతన జిల్లా అధ్యక్షురాలిగా దీపికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యారంగంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. ప్రైవేటు కార్పొరేట్ ఫీజుల దోపిడికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకున్న జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

డ్రైవర్ అజాగ్రత్తపై ఆర్టీసీ అధికారుల సీరియస్

● డ్రైవర్‌పై తాత్కాలిక వేటు

సుభాష్‌నగర్, ఆగస్టు 20: జిల్లా కేంద్రంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరదలో.. బస్సును డ్రైవర్ నడిపిన ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. బస్సును అజాగ్రత్తగా నడిపారంటూ డ్రైవర్ సాంబయ్యపై తాత్కాలిక వేటు వేశారు. డిపో స్పేర్‌లో ఉంచి విచారణకు ఆదేశించారు. నగరంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి రైల్వే కమాన్ వద్ద భారీగా నీరు చేరడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సాంబయ్య అదేమి పట్టించుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్లాడు. బస్సులో సుమారు 90 మంది ప్రయాణికులు ఉండగా.. వరద ధాటికి బస్సు మధ్యలో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఎటూ వెళ్లలేని స్థితిలో ఉండడంతో.. పోలీసులు వచ్చి వారిని సురక్షితంగా బయటకు తీశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ఆర్టీసీ అధికారులు డ్రైవర్‌పై తాత్కాలిక వేటు వేశారు. బుధవారం ఘటనకు సంబంధించిన రిపోర్టు రాగానే.. పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 20 :జిల్లా స్థాయి యోగాసన పోటీలు గురువాం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కిసాన్‌గంజ్‌లో గల ఉమామహేశ్వరీ ఫంక్షన్‌హాల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-8,10, 12,14, 16,18,21,25,30,35,45 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడకారులు జనన ధృవీకరణ పత్రాలతో పాటు మూడు పాస్‌పోర్ట్ ఫోటోలతో ఉదయం 8గంటలకు హాజరు కావాలని అన్నారు. మిగతా వివరాల కోసం సెల్-8074982200కు సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లా, ఆగస్టు 20: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మూడవ టౌన్ ఎస్సై నర్సయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపి ఆదేశాల మేరకు ఏసిపి నేతృత్వంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సిసి పుటేజీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై నీలకృష్ణ, సిబ్బంది నర్సింహులు, షౌకత్ మునీర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఆగస్టు 20: నగరంలోని మాధవనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-3 ఏడీఈ వీరేశం తెలిపారు. నగరంలోని మాధవనగర్, పాంగ్రా భూమారెడ్డి ఫంక్షన్‌హాల్ ప్రాంతం, బ్యాంక్ కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మాధవనగర్ ఫీడర్‌లో జంపరింగ్, ఏబి స్విచ్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

సుభాష్‌నగర్, ఆగస్టు 20: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నగర మున్సిపల్ కమీషనర్ మందమకరంద్ పరిశీలించారు. నగరంలోని కంఠేశ్వర్‌బైపాస్‌లో రోడ్డులో గల లేఔట్ ప్లాట్ల వద్దకు వెళ్లి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఎలా లాగిన్ అవుతున్నాయి నేరుగా వెళ్లి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై కమీషనర్ పరిష్కరించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ దిశగా టౌన్ ప్లానింగ్ అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈకార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అనుపమ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, ఇరిగేషన్ అసిస్టెంటెంట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని సొసైటీ కార్యాలయానికి తాళం వేసిన రైతులు

ఖిల్లా, ఆగస్టు 19: తమకు రుణమాఫీ రాలేదని పాల్దా సహకార సొసైటీకి తాళం వేసి సిబ్బందిని రైతులు అడ్డుకున్న ఘటన పాల్దా గ్ర సొసైటీ కార్యాలయం ఎదుట మంగళవారం రెండవ రోజు కొనసాగింది. తాళం తీయాలని సొసైటీ సిబ్బంది రైతులకు నచ్చచెప్పినా ససేమిరా అంటూ వారు నిరసనకు దిగారు. సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఉన్నతాధికారులు వచ్చి తమకు సమాధానం ఇచ్చేవరకు కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీంతో డిసివో, సహకార సంఘ అధికారి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నం చేశారు. చివరకు రుణమాఫీ రాని రైతులకు రుణమాఫీ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ విషయమై వ్యవసాయ అధికారులకు నివేదిక అందిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

ఇంటికో మొక్కను నాటాలి

కామారెడ్డిటౌన్, ఆగస్టు 20: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 47 వవార్డులో మొక్కలను పంపిణీ చేసినట్లు కౌన్సిలర్ గెరిగంటిస్వప్న లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతి ఒక్కరు కనీసం 2 మొక్కలైన నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలని అన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,000	రూ.68,200	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డబుల్ ఇస్మార్ట్ (9.00, 7.05)
: మిస్టర్ బచ్చన్ (12.25, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (3.50)
స్క్రీన్-2 : మిస్టర్ బచ్చన్ (9.10, 7.15)
: డబుల్ ఇస్మార్ట్ (12.35, 10.40)
: కమిటీ కుర్రాళ్లు (4.00)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (9.50, 1.05, 10.40)
: ఖేల్ ఖేల్ మెన్ (హిందీ) (4.20)
: తంగాలన్ (7.20)
స్క్రీన్-4 : తంగాలన్ (9.30, 12.50, 4.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
: వేధ (హిందీ) (10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తంగలాన్ (10.10, 1.15, 7.20, 10.20)
: డబుల్ స్మార్ట్ (4.15)
స్క్రీన్-2: స్త్రీ-2 (హిందీ) (10.20, 7.20)
: మిస్టర్ బచ్చన్ (1.20)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.20, 10.20)
స్క్రీన్-3 : ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20)
: డబుల్ ఇస్మార్ట్ (1.10, 7.10)
: స్త్రీ-2 (హిందీ) (4.15, 10.20)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (6.15, 9.15)
నటరాజ్ : స్త్రీ-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : డబుల్ స్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్